క్లుప్తంగా

తాగునీటి కుళాయిలు ప్రారంభం



కుళాయిని ప్రారంభిస్తున్న స్థానికులు

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రా పేపర్‌మిల్లు సీఎస్ఆర్ నిధులతో 41 డివిజన్ కోటిలింగాల పేటలో 58 మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానికులు మర్రి పుష్పరాజు, జీబీ గిరిధర్ అన్నారు. నూతనంగా ఏర్పాటు కుళాయిలను గురువారం కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. డివిజన్‌లో వీధికి నాలుగు చొప్పున మొత్తం 58 కుళాయిలను పేపర్ మిల్లు యాజమాన్యం ఏర్పాటు చేసిందన్నారు. అలాగే స్థానిక నిరుద్యోగ యువతకు పేపర్ మిల్లులో ఉపాధి కల్పించాలని కోరారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం



టీచర్ అవని కుమారిని సత్కరిస్తున్న ఎంఈవో లజపతిరాయ్ తదితరులు

కడియం: బుర్రిలంక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కె.అవనికుమారిని గురువారం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. హెచ్ఎం భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో లజపతిరాయ్ ముఖ్యఅతిథిగా పాల్గొని అవని కుమారి సేవలను అభినందించారు. ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఎంఎస్ఈబ్ల్యూ గ్రేడ్ - 1 అధికారిగా నాగవేణి



సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభకు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న నాగవేణి

కంబాలచెరువు: జీజీహెచ్ ఎంఎస్‌డబ్ల్యూ గ్రేడ్ -1 గెజిటెడ్ అధికారిగా మాగాపు నాగవేణి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఏనాడూ సదరు హోదాలో నియమకాలు జరగలేదు. రాజమహేంద్రవరంలో నూతనంగా వైద్య కళాశాల ఏర్పాటు చేయడంతో అనుబంధ ఆసుపత్రిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ నియామకానికి ఆస్కారం ఏర్పడింది. నాగవేణి రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఈమెకు గతంలో అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్, మున్సిపల్ ప్రజారోగ్య విభాగాల్లో కీలక స్థానాల్లో పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు చేపట్టిన ఆమెను మేనేజర్ కేదార్ ఆధ్వర్యంలో ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాల ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు.

జాతీయ కాన్ఫరెన్స్‌లో మంగారాణికి ప్రశంసలు



ఢిల్లీలో ప్రశంసాపత్రం అందుకుంటున్న మంగారాణి

కంబాలచెరువు: స్థానిక శ్రీ నాగరాజా స్పెషల్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి ఢిల్లీలో గురువారం జరిగిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రశంసలు అందుకున్నారు. సెలబ్రేటింగ్ స్కూల్ లీడర్‌షిప్ అనే రెగ్యులర్ ఫీచర్‌లో భాగంగా న్యూఢిల్లీలోని విశ్వయువకేంద్రంలో ఈ కాన్ఫరెన్స్ జరిగింది. మన రాష్ట్రం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి ఎంపిక కాగా, వారిలో మంగారాణి ఒకరు. ఈ కాన్ఫరెన్స్‌లో మంగారాణి విద్యాశాఖ ద్వారా పోస్టర్ ప్రెజెంటేషన్ చేశారు. కాగా.. జాతీయ సదస్సుకు హాజరై నగరానికి ఖ్యాతిని తెచ్చిన మంగారాణిని ఎస్ఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, జిల్లా సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీశంకర్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈవో - 2 రమారజని అభినందించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి దోసాలమ్మ కాలనీ సమీపంలోని ఒక నర్సరీలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.14,600 స్వాధీనం చేసుకున్నామని కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. నాలుగు సెల్ ఫోన్లు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు.

క్రీడాపోటీలతో వెలుగులోకి ప్రతిభ

- క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా
- మంత్రి వేణు
- నియోజకవర్గస్థాయి విజేతలకు బహుమతుల ప్రదానం



వాలీబాల్ జట్టు విజేత పిడింగొయ్యి-1 జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకే ముఖ్యమంత్రి జగన్ ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలను ఏర్పాటు చేశారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సరఫరాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం దేశ చరిత్రలోనే ఒక మైలురాయి అన్నారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం సాయంత్రం ఆడుదాం ఆంధ్రా రూరల్ నియోజకవర్గ స్థాయి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి వేణు మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సాధారణమని, గెలుపు కోసం ప్రయత్నించకపోవడమే నిజమైన ఓటమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు విలువైన ఇంటి స్థలాలను అందిస్తున్నారన్నారు.

పేద విద్యార్థులకు ఉన్నత విద్య

ప్రతి పేద విద్యార్థికీ ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని మంత్రి వేణు అన్నారు. మారుమూల ప్రాంతంలోని విద్యార్థులకు కూడా ఐబీ ఎడ్యుకేషన్ అందుబాటులోకి తెచ్చారన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన విజేతలను అభినందించి ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో క్రీడల్లోని విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.5 వేలు, బ్యాడ్మింటన్ విజేతలకు రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ప్రదానం చేసినట్టు మంత్రి తెలిపారు. నగదును నేరుగా క్రీడాకారుల బ్యాంకుఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కేఎన్ జ్యోతి, మండల విద్యాశాఖాధికారి తులసీదాస్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, రూరల్ నియోజకవర్గ పరిశీలకులు పీకే రావు, మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, పార్టీ నాయకులు పసలపూడి శ్రీనివాసరావు, పెయ్యల రాజేష్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

పురుషుల విభాగంలో క్రికెట్‌లో ధవళేశ్వరం-3 (ప్రథమ), ఇన్నీసుపేట -1(ద్వితీయ), మాధవరాయుడుపాలెం (తృతీయ), బ్యాడ్మింటన్‌లో కొండావారివీధి (ప్రథమ), బొమ్మూరు-4(ద్వితీయ), దుళ్ల - 1 (తృతీయ), వాలీబాల్‌లో పిడింగొయ్యి -1 (ప్రథమ), ఇన్నీసుపేట-3(ద్వితీయ), జేగురుపాడు -2 (తృతీయ) విజయం సాధించాయి. కబడ్డీలో బొమ్మూరు-3(ప్రథమ), మాధవరాయుడుపాలెం-1 (ద్వితీయ), అర్బన్ ఎంఆర్‌వో ఆఫీస్ రోడ్ (తృతీయ), ఖోఖోలో శాటిలైట్ సిటీ-4 (ప్రథమ), దుళ్ల -2 (ద్వితీయ), మహిళల విభాగంలో ఖోఖో దుళ్ల -1 (ప్రథమ), వాలీబాల్‌లో జేగురుపాడు -1 (ప్రథమ), బ్యాడ్మింటన్‌లో కోలమూరు-2 (ప్రథమ), వేమగిరి-4(ద్వితీయ) గెలుపొందాయి.

రైతుల ఖాతాల్లో వడ్డీ రాయితీ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో 2019-20 సంవత్సరంలో రూ. 3 లక్షల వరకూ వ్యవసాయం రుణం పొంది, వాయిదా లోపు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ ఇవ్వడం జరుగుతుందని సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు తెలిపారు. సొసైటీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాయిదాలోపు చెల్లించిన 713 మంది రైతులకు మూడు శాతం సబ్‌వెంషన్ వడ్డీ రాయితీ రూ.22,92,542.28 వచ్చిందన్నారు. దీనిని రాజమహేంద్రవరం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచి ద్వారా సంఘ రైతుల సేవింగ్స్ ఖాతాలకు జమ చేయనున్నామన్నారు. సమావేశంలో సంఘ చైర్‌పర్సన్లు చీరా రాజు, ఏలూరి లోకేష్, సీఈవో బొడ్డేడ రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ : వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ గురువారం ప్రకటించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ వెంకటేశ్వర నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య లాలాచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అంతరాయం కలుగుతుందన్నారు. ఈ కారణంగా జయశ్రీ గార్డెన్స్, కోకా భాస్కరమ్మ నగర్, పిల్లి వారి స్ట్రీట్, జేఎన్ రోడ్, తోట రాములు నగర్, శ్రీనివాస నగర్, నేతాజీ టవర్స్, బాలాజీ స్ట్రీట్, శారదా నగర్, షీలా నగర్, గోపాలనగర్ పుంత, అద్దేపల్లి కాలనీ, మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్, వాకర్స్ రోడ్, ఏపీ అప్పారావు రోడ్డు, మహాలక్ష్మి గుడి వీధులు, కాంచన నగర్, ఎస్‌బీఐ కాలనీ, వెంకటేశ్వర నగర్, వాకర్స్ పార్క్ ఎదుట వీధులు, డీవీబీ రాజు స్క్వేర్ 62 ఫ్లాట్లు, ఆక్సిజన్ టవర్స్, సుక్షేత్ర అపార్ట్‌మెంట్లు, విద్యుత్ కాలనీ, బర్మా కాలనీ, వేంకటేశ్వర నగర్, గెయిల్ ఆఫీస్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి



ధవళేశ్వరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌతంరెడ్డి, ఆకుల వీర్రాజు తదితరులు

ధవళేశ్వరం: ఏలూరులో శనివారం జరిగే సిద్ధం సభను జయప్రదం చేయాలని ఏపీఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ధవళేశ్వరం విచ్చేసిన ఆయనకు వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. తొలుత డీసీసీబీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజుతో కలిసి గౌతమ్‌రెడ్డి బ్యారేజ్ సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ ఎన్ని దుష్ట శక్తులు కలిసి వచ్చినా రానున్న ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్ సీపీదేనన్నారు. పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి వచ్చి ఏలూరు సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకుడు అడపా వెంకట రమణ, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, రాజమహేంద్రవరం రూరల్ మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బర్రి కామేశ్వరరావు, బొమ్మూరు వైఎస్సార్ సీపీ నాయకులు ఎనుమల త్యాగరాజు, కుమార్ సమీరా రవి, గంగాచలం ముత్యాల రావు, చల్లబోయిన దుర్గాప్రసాద్, శాఖ సురేష్, శ్రీరంగం బాలరాజు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

- రూ.25 లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు
- మంత్రి వేణు స్పందనపై ప్రజల హర్షం



హుకుంపేట చాకలపేటవీధిలో మురుగునీరు పోయేందుకు అడ్డుకట్టను తొలగింపజేస్తున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట పంచాయతీ పరిధిలోని చాకలిపేట వీధిలో కొంతకాలంగా డ్రైనేజీ నీరు ముందుకు వెళ్లే మార్గాన్ని స్థలం యజమాని మూసివేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్టీ నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఈ సమస్యకు పరిష్కారం చూపారు. వివరాల్లోకి వెళితే.. హుకుంపేట చాకలిపేట వీధిలోని సొసైటీ ఆఫీసు, చాకలిపేట వీధిలోకి మూడు ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు చేరుతుంది. అది ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోకి వెళుతుండేది. అయితే సదరు స్థలం యజమాని ఆ మురుగునీరు రాకుండా అడ్డుకట్ట వేయడంతో పది రోజులుగా రోడ్డుపై నిలిచిపోయింది. దీనికి సమీపంలోని అంగనవాడీ సెంటర్ ఉండడంతో చిన్నారులతో పాటు స్థానికులు దోమల దాడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి వేణు హుకుంపేట చాకలిపేట వీధిని పరిశీలించారు. మురుగునీరు వెళ్లకుండా వేసిన అడ్డుకట్టను పంచాయతీ సిబ్బందితో కలిసి తొలగింపజేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా రూ.25 లక్షలతో త్వరితగతిన డ్రైనేజీ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షకీలా బేగం, పార్టీ నాయకులు పసలపూడి శ్రీనివాసరావు, చిర్రా గణేష్, బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హోసన్నా ప్రార్థనా మందిరం సందర్శన

లాలాచెరువులోని హోసన్నా ప్రార్థనా మందిరాన్ని మంత్రి వేణు గురువారం సందర్శించారు. ఆయనకు చర్చి పాస్టర్ జాన్‌వెస్లీ ప్రార్థన చేసి, ఆశీర్వచనాలు అందజేశారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: నగర పరిసర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గురువారం కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయనను కమిషనర్ కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. ఆల్కాట్ గార్డెన్స్‌లోని మెయిన్ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలన్నారు. ఆ ప్రాంతంలోని చాలాఇళ్లకు తాగునీటి కనెక్షన్ ఇవ్వలేదని, దానిపై దృష్టి సాధించాలని కోరారు. టిడ్కో ఇళ్లను ఇంకా పూర్తిగా లబ్ధిదారులకు ఇవ్వలేదని, ఇచ్చిన ఇళ్లకు కనీస వసతులు లేవన్నారు. నాగుల బజారు స్టేడియంపై దృష్టి సారించాలని, ముఖ్యంగా అమృత పథకంలో ఆగిపోయిన డ్రైనేజీలను సత్వరమే పూర్తి చేయాలన్నారు.

క్వారీ గోతులు పూడ్చే వరకూ పోరాటం



పోస్టర్ల ఆవిష్కరణలో పాల్గొన్న కొండబాబు తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక 49వ డివిజన్‌లో ప్రమాదకరంగా మారిన క్వారీ గోతులను పూడ్చే వరకూ పోరాటం సాగిస్తానని, ప్రజల రక్షణకు ప్రాణాలైనా ఇస్తానని కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మాజీ చెర్మన్ బర్రే కొండబాబు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక సింహచలం నగర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ముందుగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ క్వారీ గోతులు పూడ్చుతామని, నీళ్లు తోడుతామని అధికారులు తనను మభ్య పెట్టి మోసం చేశారని, ఈసారి ఎవరి మాటకు తలొగ్గేది లేదన్నారు. క్వారీ ఏరియాలోని సింహచల నగర్‌లో నివాసం ఉంటున్న నాలుగు వేల కుటుంబాల సంక్షేమం కోసం అధికారులు, క్వారీ యజమానులపై పోరాటం చేస్తానన్నారు. ఏ రాజకీయ పార్టీకి, ప్రజాప్రతినిధులకు ఈ ఉద్యమంతో సంబంధం లేదన్నారు. గతంలో తాను ఎక్కడైతే 24 గంటల పాటు దీక్ష చేపట్టానో అదే స్థలానికి ఎవరికి చెప్పకుండా వెళ్లి కూర్చుంటానని, స్పష్టంగా లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే తప్ప ఈ దఫా ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు. క్వారీలోని 20 పేటల్లో పోస్టర్లను పంపిణీ చేస్తూ వీధి సమావేశాలు కూడా పెడతానన్నారు. కార్యక్రమంలో సింహచలం ఆటోస్టాండ్ డ్రైవర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


అపరిచితులతో పరిచయాలు ప్రమాదకరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దానవాయిపేట మునిసిపల్ హైస్కూల్లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ అపరిచితులతో బాలికలు పరిచయాలు పెంచుకోకూడదని, అవి ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. అన్యాయాలను ధైర్యంగా ఎదురుకోవాలని, వాటిని సహిస్తూ మౌనంగా ఉంటే పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారిపోతాయన్నారు. అలాగే మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యకరంగా వ్యవహరిస్తే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. పోక్సో చట్టం, 2012 నల్సా, పిల్లలకు స్నేహపూర్వక న్యాయ సేవల సంరక్షణ పథకం 2015 తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఎలాంటి న్యాయ సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.

డైట్ కళాశాల సందర్శన



డైట్ ప్రిన్సిపాల్ రమణను సత్కరిస్తున్న మస్తానయ్య

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ (డైట్)ను గురువారం రాష్ట్ర సమగ్ర శిక్షణ డైరెక్టర్ వి.మస్తానయ్య సందర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ ఆధ్వర్యంలో డైట్‌లో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ రమణను అభినందించి సత్కరించారు.

లాలాచెరువు మున్సిపల్ స్కూల్‌కు బహుమతి



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

కంబాలచెరువు: విజయవాడలో గత నెల 27 నుంచీ జరిగిన సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో నగరంలోని లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రత్యేక బహుమతిని సాధించింది. సదరన్ సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. దీనిలో పి.హరి ప్రసాద్, ఎస్.ఆనంద్ కుమార్ తయారుచేసిన సెన్సార్ గ్లాసెస్ ఫర్ బ్లైండ్ సెన్సార్ గ్లాసెస్ ఫర్ నైట్ టైం డ్రైవర్స్ ప్రాజెక్టుకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ వారి బహుమతి లభించింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థులు, గైడ్ టీచర్ ఎస్.దీపికను విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్, టెక్నాలజికల్ మ్యూజియం క్యూరేటర్ బెహరా, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాప్ రెడ్డి, కాకినాడ జోన్ ఆర్‌జేడీ నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, జిల్లా సైన్స్ అధికారి నెహ్రూ అభినందించారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

ప్రకాశం నగర్: క్రీడాకారుల్లో దాగిన ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలు మంచి వేదికగా మారాయని రుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా రెండోరోజు జిల్లాస్థాయి పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహించి, వారి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, తలుపూరి ప్రసాద్, నీలం గణపతి పాల్గొన్నారు కోకో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర పోటీల్లో క్రీడాకారులు తలపడ్డారు.

ప్రధాని మోదీ పాలనలో దేశాభివృద్ధి



బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందుతోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు అన్నారు. రాష్ట్ర స్థాయిలో బీజేపీకి సంస్థాగతంగా రెండువేల మందికి పైగా అసెంబ్లీ అభ్యర్థులు, మరో వెయ్యిమందికి పైగా పార్లమెంటు అభ్యర్థులు ఎన్నికలలో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గురువారం స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్‌లో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో రేలంగి శ్రీదేవి, పరిమి రాధాకృష్ణ, జాస్తి మూర్తి, అడబాల రామకృష్ణ, కొల్లివలస హారిక, సత్య గోపీనాథ్ దాస్, రొంగల గోపి శ్రీనివాస్, కురగంటి సతీష్ పాల్గొన్నారు.

నేడు భవనాల ప్రారంభం

కడియం: దుళ్లలోని రెండు రైతు భరోసా కేంద్రాలు, రెండు సచివాలయాలు, ఒక వెల్నెస్ సెంటర్ భవనాలను శుక్రవారం ఉదయం 9 గంటలకు మంత్రి వేణు ప్రారంభించనున్నారు. పాలనా పరమైన సంస్కరణల్లో భాగంగా సీఎం వైఎస్ జగన్ గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వీటిని నిర్మించారు.

బడ్జెట్ పేరుతో ఎన్నికల గారడీ

ప్రకాశం నగర్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కేవలం బడ్జెట్ పేరుతో చేసిన ఎన్నికల గారడీ అని సీపీఐ కార్యదర్శి తాటిపాక మధు గురువారం ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని మోదీ మరోసారి మొండిచేయి చూపారని, బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావన లేనేలేదన్నారు. పదేళ్లలో ఎంతో మోసపోయిన పేదలు, రైతులు, మహిళలు, యువకులు రానున్న ఎన్నికల్లో మోదీని ఓడించడం ఖాయమన్నారు.

ఏబీ వరప్రసాద్ సేవలు అభినందనీయం

- కలెక్టర్ మాధవీలత
- పీఆర్ ఈఈకి ఘనంగా వీడ్కోలు



వరప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఏబీ వరప్రసాద్ అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. వరప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం రాత్రి స్థానిక సూర్యగార్డెన్స్‌లో అభినందన సత్కార సభ నిర్వహించారు. ఏబీ వరప్రసాద్, శారద దంపతులను కలెక్టర్ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె మాట్లాడుతూ వరప్రసాద్ జిల్లాలో ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేసి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువచ్చారన్నారు.

వరప్రసాద్ మాట్లాడుతూ 18 నెలల్లో కలెక్టర్ మాధవీలత దిశానిర్దేశంలో పనిచేయడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ బాలు నాయక్, చీఫ్ ఇంజినీర్ నాగరాజు, కాకినాడ జిల్లా ఎస్ఈ సత్యనారాయణ, కోనసీమ జిల్లా ఈఈ చంటిబాబు, జిల్లా అధికారులు డి.బాల శంకరరావు, బీఎస్‌బీవీరెడ్డి పాల్గొన్నారు.

గిరిజన సాంస్కృతిక మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు దేశానికి పట్టుగొమ్మల వంటివని, వాటిని భావితరాలకు వారసత్వంగా అందించాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యాన ఈ నెల 5న రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవాల పోస్టర్, కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లి భాస్కర్, జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప, రాష్ట్ర కార్యదర్శి విష్ణు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల : కిస్మత్
సూర్యమినీ : గేమ్‌ఆన్
సూర్యప్యాలస్ : హ్యాపీ ఎండింగ్ (మార్నింగ్ షో), ఫైటర్ (మూడు ఆటలు)
స్వామి : బూట్‌కట్ బాలరాజు
శివజ్యోతి : అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు
అనుశ్రీ : హనుమాన్
రాజా : హనుమాన్
అశోక : సలార్
ఊర్వశి : నా సామిరంగ
రంభ : కెప్టెన్ మిల్లర్
మేనక : ధీర
అప్సర : గుంటూరుకారం
కుమారి : అంబాజీపేట మ్యారేజీ బ్యాండు

నామవరం
వీఎస్ మహల్ : హనుమాన్

ధవళేశ్వరం
మురళీకృష్ణ : అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు

కడియం
వెంకటసూర్య : హనుమాన్